# చాలీ చాలని సుఖం

అక్కపెద్ది వెంకటేశ్వర శర్మ

"ర జనీ..."

గబగబా కోఠీ బస్టాండువైపు నడుస్తూన్న దాన్నల్లా ఎవరో పిలవడంతో ఠక్కున ఆగి వెనక్కి తిరిగాను.

ఆశ్చర్యం!

శేఖర్....! ఆరేళ్ళ తర్వాత యిలా హఠాత్తుగా.. నడిరోడ్‌న .... డోర్ తీసి "కమిన్" అన్నాడు.

నిమిషంపాటు నాలో మిడిల్ క్లాస్ మొరాలిటీ తటపటాయించింది. ఎక్కడమా ....మానడమా....

"ఏమిటి....ఈ ఆరేళ్ళలోనే అంతగుర్తుపట్ట లేనంతగా మారిపోయానేంటి?".... చిత్రంగా భుజాలెగరేశాడు.

అప్పటికే ఓ నలుగురి చూపులు ప్రశ్నార్థకాలుగా చురుక్కున తాకటంతో తప్పనిసరిగా ఎక్కి ఒదిగి కూర్చున్నాను.

భుజం చుట్టూ కప్పుకున్న చీరకొంగు వేళ్ళ మధ్య మెత్తగా నలుగుతోంది. ఒళ్ళో హేండ్ బేగ్ అర్థంకాని భారంగా ఉంది.

"ఎక్కడికి....?"

ఉలిక్కిపడ్డాను....అదేంటి....ఎందుకిలా.. గుటకమింగి యింటి అడ్రసు చెప్పాను.

విశాలమైన రోడ్ మీద అంబాసిడర్ పరుగులు తీస్తోంది. ఎక్కడి శేఖరం....రాజమండ్రిలో డిగ్రీ చదివే కాలంలో ఆయన క్లాస్‌మేట్ శేఖరం ...ఇన్నాళ్ళకిలా....అదీ కారులో....!

క్షణంపాటు నాకే తెలీని ఊహా నిట్టూర్పుగా బయట పడింది.

"వెల్...ఆరేళ్ళ తర్వాత కదూ కలుసుకోవటం...." ఎడమ చేత్తో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూ కుడి చేత్తో సిగరెట్ స్మోక్ చేస్తున్నాడు. కంటి కొసనించి చూస్తే రూపం స్పష్టంగా కన్పిస్తోంది. అసలే తెలుపు.... బాగా ఒళ్ళొచ్చింది... డబ్బు తెచ్చిన హుందాతనం కారు డ్రైవ్ చేయడంలోనూ పలకరింపులోనూ కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"సరిగ్గా నెలయింది....ఇక్కడే కలెక్టరాఫీస్‌లో పోస్టింగ్...." కారు సడ్రున మలుపు తిరిగింది. జరుక్కుమన్న ఆ ఊపుకి తూలి పడబోయి విండో పట్టుకుని ఆగాను.

రెండేళ్ళ క్రితం....ఐ.ఏ.యస్....పరీక్షకి నిద్రాహారాలు మానీ చదువుతానన్న శేఖరం....అయిపోయాడా!

రోడ్ గజిబిజిగా వంకర్లు తిరిగి మలక్‌పేట దాటి దిల్‌సుఖ్‌నగర్ వైపు పరుగులు తీస్తోంది.

"ఆ ... మీ ఆయన .... అదే మావాడెలా ఉన్నాడు?"

"బానే ఉన్నాం..." జవాబు అరిగిపోయిన రికార్డులా సాగదీసినట్టు వచ్చింది.

బి. కాం. చదివే కాలంలో సన్నగా, తెల్లగా, ఎప్పుడూ అదోరకం దురుసుతనంతో కన్పించే శేఖర్ ఇవాళ ఐ. ఏ. యస్సా?

సంశయం, ఆశ్చర్యాల మధ్య క్షణాలు నలుగుతూంటే.......

"ఆరేళ్ళలో ఏమన్నా మార్పువచ్చిందా ...యింకా ఆ కథలు రాసుకుంటూనే ఉన్నావా?........"

పెదవిని పంటికింద బిగపట్టాను. నాకు తెలుసు. నేను నోరుతెరిస్తే యిద్దరిమధ్యా ఓ దుమారం లేవాల్సిందే.

"వాడి పేరు కనబడని పత్రిక ఉండడం లేదు....అందుకని అడిగాను"— ఆ వ్యంగ్యానికి బాధా, ఆ నిజానికి రవంత గర్వమూ కలిగాయి.

"ఇన్‌స్టింక్ట్స్ మార్చుకోవాలన్నా మారవుగా........"

"అఫ్‌కోర్స్ .... కానీ మనిషి తనను తాను కంట్రోల్ చేసుకోవాలి—లేకపోతే పెరుగుదలే ఉండదు."

'పెరుగుదల' అన్నమాటకి నాలో చెప్ప లేనంత ఆ వేశం వెల్లువలా పొంగబో యింది. అతి కష్టంమీద నిగ్రహించుకున్నాను. మొదటినుంచీ యిదే ధోరణి. ఎదుటి మనిషిని హర్ట్ చేసి ఆనందించే శాడిస్ట్ లక్షణం!

మరో మూడు నిముషాలు నిశ్శబ్దంలో కరిగి పోయాయి.

"క్రిందటేడు పెళ్ళి చేసుకున్నాను...."

క్షణంపాటు తెల్లబోయి అంతలోకే నవ్వుకున్నాను—"పిలవ లేదేం" అని అడుగుదామని వచ్చిన నా ఊహకి! చెఫినెట్లీ తన మ్యారేజ్‌కి ఎవర్నీ పిలవడు. నాకు తెలుసు. ఒట్.... ఒకనాడు ఎంతో క్లోజ్ ఫ్రెండ్.... ఆయన్ని కూడా యిన్వైట్ చేయలేదు.... కనీసం కర్టసీ కోసం యింటిమేషన్ అయినా........

"చెప్పకుండా చేసుకున్నాననా... అఫ్‌కోర్స్.... జస్ట్.... కుదర్లేదంతే..." ఎంత సింపుల్‌గా ఎస్కేప్ అవుతున్నాడు!

కారు కాలనీ రోడ్ మీదికొచ్చింది. నారంగా మలుపు తిరిగాక కుడివైపుగా ఉన్న తెల్లరంగు డాబా యింటిని చూపించాను.

బద్ధకంగా మూలుగుతున్న రాజకుమారిలా కారు ఆగింది. వాకిట్లో—ఆయన అప్పటికే వచ్చేశారేమో .... మల్లెచెట్టు పక్కన వాలు కుర్చీలో పేపర్ చదువుతున్నవారల్లా కారు చప్పుడుకు తలతిప్పి గభాల్న లేచి 'ఒరే శేఖరం' అంటూవచ్చి, అమాంతం కావలించేసుకున్నంత పనిచేసి— "నీ కెక్కడ దొరికాడే మావాడు"... అంటూనే 'రారా' అని కుర్చీ చూపించి తనూ పక్కన కుర్చీలో కూర్చున్నారు.

"శోభనించి వస్తూంటే కన్పించిందిరా నీ శ్రీమతి....బహుకాలదర్శనం కదా అని యిలా ..."

"అబ్బ యిన్నాళ్ళకి గుర్తొచ్చా నన్నమాట... " నిష్ఠూరంగా అన్నారు.

నేను చాలా బిజీ....యూనో.... అస్సలు తీరికే లేదు. .." ఆయనేదో అనబోతూండగానే—" పెళ్ళాడేసేరట క్రిందటేడే-మీ ఫ్రెండు—" అనేసి లోపలికెళ్ళాను.

"నిజం !" నమ్మలేనట్టు ఆయన గొంతు షాక్ కొట్టి నట్టు !!

o o o

కాలాన్ని ఆరేళ్ళు వెనక్కి పట్టిలాగితే—

—జీవితం సరిగ్గా అక్కడే మొదలయిందన్పిస్తుంది. అప్పట్లో నేనూ, సుధాకరం, శేఖరం....అంతా బీ·కాం. చదివే రోజులు. రాజమండ్రి విమెన్స్ కాలేజీలో నేనూ, గవర్న్‌మెంట్ కాలేజీలో వాళ్ళూ.... ఇద్దరూ కొవ్వూరునించి రోజు ట్రైన్‌లో వచ్చేవాళ్ళు.

ఒరోజు ఎంతో యాక్సిడెంటల్‌గా ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణానికి పునాదులు ప్రారంభమైన గోదావరి ఒడున భలే చిత్రంగా మా పరిచయం జరిగింది.

ఆ ఆదివారం పూట నేనూ, నా ఫ్రెండ్స్ కళ్యాణి, జ్యోతి—ముగ్గురం కలిసి ధవళేశ్వరం పిక్నిక్ వెళ్ళాము.





మూడో నెంబరు బస్సెక్కి ధవళేశ్వరం స్టేజిలో దిగేసరికి మధ్యాహ్నమయిపోయింది. ఎండ విపరీతంగా వుంది.

ఎదురుగా రోడ్ పక్కన చిన్నహోటల్ పేరున్న పాక ఒకటుంది.

"ఒసేవ్ నీకోసం' ఈ మండుటెండలో వచ్చాం. ..మరి. కాసిని కాఫీనీళ్ళేమన్నా పోయిస్తేగానీ అంగుళం కూడా కదలం " ఓ చెట్టుకింద బైఠాయించేశారిద్దరూ. నల్లెమ్మని తల తిప్పి పాక వైపు కదిలాను

ముగ్గురం కాలేజీ అమ్మాయిలం రంగు రంగుల చీరల్లో కన్పించే సరికి గబగబా బల్ల తుడిచి "ఏంకావాలమ్మా" అన్నాడు హోటల్ వాడు.

"మూడు స్ట్రాంగ్ కాఫీ...." అంటూ ఓ మూలగా కూచున్న యిద్దరు కుర్రాళ్ళని చూసి సౌండ్ తగ్గించాను.

"బుట్టబొమ్మల్లా ఉన్నారు కదరా . " తెల్లగా, సన్నగా ఉన్న ఒకతను అంటు న్నాడు. పక్కనే కాస్త సన్నగా, పొడుగ్గా ఉన్న మరో కుర్రాడు ఏదో చెప్పి వారిస్తున్నాడు కాబోలు....నాకు ఒళ్ళు మండిపోయింది.

"గుంటనక్కల్లా ఉన్నారు కదే " అన్నాను కసిగా.

కళ్యాణి. జ్యోతి-యిద్దరూ ఫక్కుమన్నారు.

కాఫీగ్లాసుల్తో కుర్రాడు వస్తూంటే చేయి అడ్డుగా పెట్టి "గురూ... ముందు ముందు తెమ్మన్నది మేం .. " అన్నాడు ఆ పోకిరి గ్లాసులు లాక్కుంటూ.

నాకీసారి నిజంగా తిక్క రేగిపోయింది .

"నాన్సెన్స్.... ఓయ్ హోటలాయనా .ముందు మాకిస్తే తాగుతాం లేకపోతే పోతాం . ." అన్నా లేచి నిలబడి. నాకు వత్తాసుగా మా యిద్దరూ లేచారు

"పాపం ఆడపిల్లలు—జస్ట్....దానకర్ణుడిలా కాఫీగ్లాసు పని పిల్లాడిచేతిలో పెట్టాడు. వాడేమో "తీసుకోండమ్మా" అని టేబుల్ మీద పెట్టీ పెట్టగానే తీసి కింద పారబోసి 'డామిట్' అని కసిగాలేచి విసురుగా బయటకు వచ్చేశాం

"అమ్మా ." హోటల్ వాడేదో అనబోతున్నా విన్పించుకోలేదు.

"ఛ . ఎంత సిల్లీగా బిహేవ్ చేస్తావురా శేఖరం...." బయట కొచ్చాక మట్టిగోడ కిటికీలోంచి రెండో అతని గొంతు మంద్రస్థాయిలో విన్పిస్తోంది.

—అలా చిరాగ్గా నడుస్తూ కాలవదాటి చాలా చాలా దూరం వచ్చేశాం. ఫిబ్రవరి మొదలైన రోజులేమో నది అప్పుడేకొద్ది కొద్దిగా యింకిపోతోంది.

ఎక్కడినించో కుప్పలుగా పారేసినట్టున్న బండరాళ్ళ మీంచి బేలెన్స్ చేస్తూ నడుస్తూ వెళ్ళి ఓ చోట నీళ్ళ ఒడున ఇసుకలో కూలబడ్డాము

"అబ్బ రజనీ .. చూడవే సీలానే వెన్నెల . . ఎంతబావుందో .. మరికాస్త దూరం నడుద్దామా "జ్యోతివెక్కిరింపు


"హీట్ మీదుందసలే. నిన్నూ నన్నూ యీగోదాట్లో ముంచేసినా ముంచేయగలదు" కల్యాణి హేండ్ బేగ్ పక్కన పడేసి "హమ్మయ్య . తల్లీ. .నావరాల రజనీ కుమారీ....ఈ వెన్నెల్లో ఫోటోలు కూడా తీసుకుందామని కెమెరాకూడా తెచ్చావు కదూ .అబ్బ....ఎంతబాగుంటాయోకదూ త్వరగా తీసేయ్యవే...."అంది.

"అవునవును... వీటినే పెళ్ళి చూపులకి పంపిస్తే పూర్ ఫెలోస్ ఫెయింటైపోతారు" జ్యోతి ఫక్కుమంది.

నాకసలే తిక్కగా ఉందేమో కాసిని నీళ్ళుతీసి యిద్దరి ముఖానా కొట్టి "ఇలా గోల చేస్తేయిప్పుడే వెళ్ళిపోదాం.. "అలక నటించాను.

"ఓకే....నీయిష్టం....నోరెత్తం నరా" ఇద్దరూ మూగనోము పట్టారు.

మెత్తని పచ్చ తివాసీ పరచినట్టు ఇసుక మేటలు....దూరంగాఎవదో రాతి కట్టడం ఎదురుగా ఆవలివైపు ఒంటికాలిమీద నిలబడ్డ ఓ కొంగ నీళ్ళమీంచి వస్తూన్న సేమ




గాలిలో ఓ థ్రిల్.

"ఎంత బాగుందో కదూ"

"ఓ ప్రైన్ నీ హనీమూన్ యిక్కడే"

కల్యాణి నాలిక బయట పెట్టి వెక్కిరించింది నామాటకి

"వైనాట్ అలా గోదారి బ్రిడ్జి మీంచి నడిచి ఈ నీటి ఒడున పారిపోయే చేప పిల్లల్ని చూస్తూ అనుకుంటూంటే ఈ ట్రైల్ ఇంత నేచురల్ బ్యూటీ ఎక్కడ దొరుకుతుందే"

"అబ్బో ఊహలు చాలానే ఉన్నాయే ఇంతకీ హీరో ఎవడే"

దాని అల్లరికి క్షణంపాటు సిగ్గుతో తలొంచుకున్నాను.

ఇద్దరూ బేగ్స్‌లోంచి బిస్కెట్ల పొట్లాలు తెరిచారు.

కబుర్ల మధ్య కాలం మెల్లిగా నడుస్తోంది

ఉన్నట్టుండి "ఓసి హీరోయినూ, అదుగోనే యిందాకటి విలన్" జ్యోతి భుజం తట్టేసరికి ఊహల్లోంచి తేరుకుని అటు చూశా మాకు ఓ రెండొందల గజాల దిగువవాలు వైపు వాళ్ళిద్దరూ!

"ఈ గ్రహాలు ఇవాళ్టికి వదిలేలా లేరు" కచ్చగా అన్నాను. "అవునే ..రాహుకేతువులందామా" కల్యాణి వంతపాడేలోగానే "ఆగండి ఓ గమ్మత్తు చేస్తాను." అని ఓ పేపర్‌ని చదరంగా చించి ఓ పడవ చేసి బాల్ పెన్ తీసి "ఇడియట్స్" అని రాసి నీళ్ళలో వదిలింది

ప్రవాహం వాలులో వయ్యారంగా కదుల్తూ మహారాణిలా మా కామెంట్‌ని మోసుకెళ్లోంది పడవ

మా యిద్దరికీ నవ్వొచ్చి ఫక్కుమన్నాం.

—సరిగ్గా ఊహించినట్టుగానే మేం చేస్తూన్నది చూస్తూన్న ఆ శేఖరం అన్న కుర్రాడు అది దగ్గరగా రాంగానే నీళ్ళల్లోంచి తీసి చదివి కోపంగా చించేసి ఫ్రెండ్ చేతిలో పెట్టాడు.

ఆ సీన్ చూసి పగలబడి నవ్వొచ్చింది. "హో" అంటూ మరింతగా గోలపెట్టాం. హుషారు ఆకాశమంతెత్తు ఎగిసి పోతోంది

దూరంగా షెడ్లలో వున్న కూలీలు ఒక్కొక్కతే వెళ్ళటం మొదలుపెట్టారు-భోజ

నాల వేళ కాబోలు

వాళ్ళిద్దరూ లేచి మెల్లిగా యిటే వస్తున్నారు.

అల్లరికేం చేశాంగానీ వాళ్ళతో ముఖాముఖి ...బాప్ రే. భయంతో ఒళ్ళు ఝల్లుమంది

కల్యాణికి ఇట్లాంటి పోట్లాటల్లో ధైర్యం జాస్తి. ఓసారి ఎవడో రోడ్ మీద ఏదో వాగితే ఎడమకాలి చెప్పుతో సత్కరించేసింది

"ఒసే " నేను భయంగా లేవబోతే.

"షటప్ ..ఇలా భయపడ్తేనే వాళ్ళు తిక్కవేషా లేస్తారు నువు చూస్తూఉండు ." అంటూ కొంగు నడుముకు బిగించిది

శేఖరం అనే అతను దూరంగా వెళ్ళి పోయాడు. రెండో అతను మెల్లిగా దగ్గరగా వచ్చి ఆ చిరిగిన తడి ముద్దని నా చేతిలో పెట్టాడు

ముగ్గురం అనుకోని యీ హఠాత్ పరిణామానికి తెల్లబోయాం.

"చూడండీ ...ఓ మనిషిని ఇడియట్ అనేముందు ఆ మనిషిని గురించి పూర్తిగా తెలుసుకోవడం మంచిది. టీజింగ్ కి ఉడుక్కోవడం ...హ్యూమర్ ని భరించలేక పోవడం . విచారించాల్సిన విషయాలు ఓ కే ....మా ఫ్రెండ్ తరఫున నేను అపాలజీ చెపుతున్నాను "

మేం తేరుకునేసరికి అతను దూరంగా కదిలి వెళ్ళి పోతున్నాడు చాలాసేపు ఆ మాటలు చెవుల్లో గింగురుమన్నాయి

—ఆ తర్వాత అతన్ని చాలాసార్లు ఇంటర్ కాలేజియట్ వక్తృత్వ పోటీల్లో చూశాను. ఓసారి నాటక పరిషత్ పోటీల్లో అతను రాసి, హీరోగా వేసిన నాటకానికి బెస్ట్ స్క్రిప్ట్ అవార్డ్ వచ్చింది అందులో డైలాగ్స్ వింటూ ఎంతగానో యిమ్మర్స్ అయిపోయానెందుకో

మేం ముగ్గురం ఎప్పుడూ ఎలాకలిసి తిరిగే వాళ్ళమో, ఏ సినిమా దగ్గిర చూసినా, బస్టాండ్ దగ్గర కలిసినా, వాళ్ళిద్దరూ జంటకవుల్లా కన్పించేవాళ్ళు.

ఓ రోజు సాయంత్రం కల్యాణి వాళ్ళింటి నించి వస్తూంటే రిక్షాటైరు పంక్చరయింది. తిట్టుకుంటూ దిగి పక్కనే వెళుతున్న ఒక తన్ని రాసుకున్నంత దూరంలో ఆగాను . చూస్తే—

అతను !

పెదాలమీద పలకరింపుగా సన్నని చిరునవ్వు. .

అప్రయత్నంగా అతనితో పాటు నడుస్తున్నానని పదడుగులు వేసేదాకా తోచలేదు. తెలిశాక ఎలావిడిగా వెళ్ళాలో అసలే అర్థంకాలేదు.

"ఇంటికా "

త లూ పా ను... ఎ ం దు కో అ త ను మాట్లాడుతూంటే చాలా లైవ్లీగా అన్పించ సాగింది

"మీ నాటకం బాగుంది " చీర కొంగుని వేలికి చుట్టేస్తూంటే అను కోకుండానే అనేశాను నిశ్శబ్దం గట్లు తెగింది—

"ఎప్పుడు చూశారు "

"పరిషత్ పోటీల్లో "

"మీరు నాటకాలు చూస్తారా"

"ఏం మనిషిని కానా... "


అతను సన్నగా నవ్వాడు ...చనువు బిడియపు కర్టెన్ ని కొద్ది కొద్దిగా తొలగిస్తోంది . మాటలు గొలుసులా అల్లుకుంటూంటే !

మాటల్లోనే ఇద్దరం గోదావరి స్టేషన్ బ్రిడ్జి దగ్గరకొచ్చాం. నాకు క్షణంపాటు కంగారన్పించింది. ఇలా ఎవతో ముక్కుముఖం తెలియని వీడితో నడవడం ఎవరన్నా చూసి ఎవరంటే ఏమని చెప్పడం ?

అతను గ్రహించినట్లు "ఇంతదూరం వచ్చాక ఆడపిల్లనని గుర్తొచ్చిందా ?" అన్నాడు.

దారికి పోయేసరికి తలొంచుకుని 'వస్తాను' అన్నాను.

"ఎప్పుడు.. ?"




తలెత్తేసరికి అతని పెదవులమీద కదిలీ కదలని నవ్వు.

జడ విసురుగా వెనక్కి వేసుకుని పుస్తకాల్ని గుండెకు హత్తుకుని గబగబా దూరంగా వచ్చేశాను.

అప్సరా హోటల్ దాటుతూ ఎందుకో ఉండబట్టలేక వెనక్కి తిరిగి చూస్తే... బ్రిడ్జి మొదట్లో తెల్లని బట్టల్లో చేతులు కట్టుకుని . యిటే చూస్తూ. . అతను!

నా హృదయ స్పందన తొలిసారి చిత్రంగా ధ్వనించింది నాకే!!

—ఆతర్వాత ఏదో సినిమాలో కలిశాడు. నేనూ కల్యాణి, జ్యోతి ఉన్నామా రోజు తనొక్కడే వచ్చాడు! . ఆరోజు కొద్దిగా సరదాగా మాట్లాడ గలిగానన్పించింది. ఇంట్రవెల్‌లో అతనే కాఫీలు యిప్పించాడు. అతని పేరు అతని నోటే విన్న అనుభవం . .సుధాకర్!-

ఎందుకో ఆరాత్రి చెప్పలేని ఆనంద మన్పించింది

ఏదో తెలీని ఉద్విగ్నత మనశ్శరీరాలను కుదిపేసింది.

ఫైనలియర్ కొచ్చేసరికి అతనితో చనువు ఫ్రెండ్షిప్ పరిధిని దాటేసింది. తీరిక దొరికితే గోదావరి బ్రిడ్జిమీదో ధవళేశ్వరం గట్టుమీదో....ఎన్ని థ్రిల్స్ ఇంట్లో అమ్మ కోప్పడుతుంది తెలిస్తే? అయినా ఏదో శక్తి నన్ను డ్రైవ్ చేసి ముందుకు నడిపించేది. అనుభూతిగా మారుతూన్న ఒక్కో తీయని అనుభవం-అతి చిన్నదే అయినా మధురంగా అనిపించేది.

చూస్తూండగానే ఫైనల్ పరీక్షలు వచ్చేశాయి.

అప్పటికే ఆయన ఫ్రెండ్ శేఖరంతో కూడా బాగా పరిచయం ఏర్పడింది. ఆయనకీ శేఖర్‌కీ చాలా తేడా ఉంది. మనిషి ఉన్నదాంట్లో సుఖపడాలని ఆయన వాదన. మనిషికి డబ్బు తర్వాతే సెంటిమెంట్స్ అనేవాడు శేఖర్ .

శేఖరమంటే కల్యాణికీ జ్యోతికీ ఒళ్ళుమంట. అతనొచ్చినప్పుడు పెదవి మెదిపేవాళ్ళు కాదు-అనలొచ్చేవాళ్ళు కాదు.

ఫైనల్ పరీక్షలకి చాలాచాలా కష్ట

వేద్దాం, ఎలాగైనా చదివేసి ట్రోట్స్ చేసేయాలని మా ముగ్గురికీనూ!

"జాబ్సెందుకు ఆడపిల్లలకి-మగాడి జీతం చాలకపోతే తప్ప ఆడపిల్లకి 'ఉద్యోగం ప్యూర్ వేస్ట్-" ఇలా వాదించేవాడు శేఖర్. ఆ మాటల్లో రాను రానూ నాకే తెలీకుండా అతనంటే ఓవిధమైన అయిష్టత పెరిగిపోయేది.

పరీక్షలయాక ఓ రోజు—

ముగ్గురం 'పంచవటి'లో ఫేమిలీ రూంలో కూర్చున్నాం. ఎదురుగా వాళ్ళిద్దరూ!

"చూస్తుండగానే-క్షణాదిన్నర నిముషంలా గడిచిపోయిందే.." సుధా మాట పూర్తి కాకముందే-"నథింగ్ కాలం అలా వెళుతూనే ఉంటుంది ఒక్కో స్టేజి దాటాక మనం గుర్తిస్తాం. దట్స్ కామన్—" అన్నాడు

ఎందుకో శేఖర్ మాటల్తో అందరి మధ్యా నిశ్శబ్దం భరించలేనంతగా పెరుకుపోయింది.

మూగజీవాల్లా ఆఖరిసారి అలా వీడ్కోలు చెప్పుకున్నాక—

అందరం పాసయ్యాం ఆయన కి సెకండ్ క్లాస్ .శేఖర్ ఫస్ట్ క్లాస్ !

ఉద్యోగ ప్రయత్నంమీద ఆయన హైదరాబాద్ వెళ్ళిపోయారు ఇద్దరి మధ్యా పూలజల్లులా ఉత్తరాలు ప్రతి ఊహ, సరిగమ ప్రతి పలుకూ ఓ గిలగిల ఎంత ల ... సరిగ్గా ఆర్నెల్లలో అ..ం ..ంట్ జనరల్ ఆఫీసులో ఆయనకి ...ా వచ్చింది! ఆ తర్వాత నెల్లాళ్ళకే నాకూ టెలిఫోన్స్‌లో ఆపరేటర్‌గా సెలక్షన్ వచ్చింది

నాకు ఆనందం పట్టశక్యం కాలేదు నాకు జాబ్ వచ్చినట్టు రాయగానే ఆయన రెండ్రోజుల్లో వచ్చేశారు. వస్తూ రమ్మని శేఖరానికి టెలిగ్రాం యిచ్చారట. వైజాగ్ యూనివర్సిటీలో యం.కాం. చదువుతున్న శేఖరమ్మూ ఆయన వచ్చేసరికి దిగేశాడు

ఆ సాయంత్రం—

అదే ధవళేశ్వరం. ..గోదావరి ఒడున—ఇద్దరం కూర్చున్నాం పక్కపక్కనే. ఎదురుగా శేఖరం ..చిన్ని చిన్ని గులక రాళ్ళని—దూరంగా నీళ్ళలోకి విసిరేసి అలల్ని సృష్టిస్తూ....

ముగ్గురిమధ్యా క్షణాలు నిశ్శబ్దంగా దొర్లి పోతూంటే....

నీళ్ళ 'కదలిక వింతగా ధ్వని....చల్లగాలిని ఒంటిని నిమిరే వింతైన గగుర్పు.... నీళ్ళల్లో చేపపిల్లల సజీవమైన కదలిక.... వాతావరణం మొత్తంలోనే ఓ నిసర్గ సౌందర్యం . కడలిఅంచులోగోదారి"కలిసే దెక్కడ?—

నా ఊహల అలన్ని చెరిపేస్తూ శేఖర్ గొంతు ఖంగు మంది—

—"నేనెందుకో మీరు తొందర పడుతున్నారనుకుంటాను—"

మా మేరేజ్ సంగతి చెప్పగానే చాలాసేపు మాట్లాడకుండా ఉండి అతనన్న మొదటి మాట అది! ఆక్షణాన అతనికి కాడిస్ట్ లక్షణాలుకూడా లేకున్నాయనిస్థిరంగా అన్పించింది.

"ఎందుకని?" సుధా సూటిగా చూస్తూ అడిగాడు.


"యూ ఆర్ ట్వంటీ త్రీ మీ ఈజ్ ట్వంటీ ఈ ఏజిలో మారేజ్ ఏమిటి? కనీసం యింకో ఏడేళ్ళు . "

"కానీ తనికి మేచ్ సెటిల్ చేస్తున్నారు"

"ఆగమని చెప్పు ఇప్పుడే మేరేజ్ అయితే మరో నాలుగేళ్ళ కల్లా పిల్లలూ .సంసారం ట్రాష్ ...లైఫ్‌లో ఎదుగుదల ఉండదు "

"కానీ పరిస్థితి "

"అఫ్ కోర్స్ ఇంటరెస్ట్ అని మీకు పెద్దవాళ్ళు 'హా' అనేదాకా గుర్తుకు రాలేదంటే యూ ఆర్ ఇన్ యిల్యూజన్ .. ఆర్ సే డమ్మీ ఇన్ డిస్లెప్ ఆఫ్ లవ్ .మీ పేరెంట్స్ స్ట్రాంచ్ ఎగెనెస్ట్ మరి మీరు ఎలాటి స్టెప్స్ తీసుకోదల్చుకున్నారు?"




—క్లోజ్ ఫ్రెండ్ గదా అని ఆయన పిలిచి సలహా అడిగినందుకు అదీ ఈ సమస్య అతనిముందు పెట్టినందుకు నాకు ఆయన మీద నిజంగా మండి పోయింది

"వియ్ హేవ్ డిసైడెడ్ "

నామాటకి నవ్వి చేతిలో రాతిని దూరంగా విసిరేసి "ఇట్స్ యువర్ ఓన్ రిస్క్ ." అన్నాడు

మరో అల కదిలి క్షణాల్లో సర్దుకుంది

—ఆతర్వాత గోదారి బ్రిడ్జిమీద చేతిలో చెయివేసుకుని మర్నాడు నవ్వుతూ—

"శేఖర్ మాటలకు నువ్వేమను కున్నావు నిన్న ? "

ఆయన ఎప్పుడు ఆ టాపిక్ కదిలిస్తారా అని ఎదురు చూస్తూ కుత కుత లాడి పోతున్న నేను దులిపేశాను

"అసలా మనిషికి మనమంటే, మన క్లోజ్ నెస్ అంటే జెలసీ ఐథింక్ హి ఈజ్ టూ జలస్ ఆఫ్ "

—సుధా చిన్నగా చేత్తో నా నోటి మీద చిన్నదెబ్బకొట్టి "ఓ కే–లీవిటాఫ్ " అన్నారు

అప్పాయింట్ మెంట్ వచ్చాక నేనూ హైదరాబాద్ వచ్చేశాను ఇద్దరం జాబ్స్ చేస్తూ ఓ నెల్లాళ్ళు ఒంటరిగా తరచూ కలుసుకోవడంతో మనసు పెళ్ళివైపు పరుగులు తీసేది-నాకా నాన్న లేరు అమ్మ నాతోనే వచ్చేసింది ఆవిడ భయం ఆవిడది. ఆ మూడుముళ్ళూ పడితే తనకి నిశ్చింత రోజూ పోరు పెట్టేది

వాళ్ళ వాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు. ఆయన నాన్నగారొచ్చి ఏనోటికొచ్చినట్టు తిట్టి, నన్నూ తూలనాడి భుజంమీది ఒట్ట దులిపేసి 'ఎవరకెవరూ కారు' అన్నట్టు వెళ్ళిపోయారు

-సరిగ్గా వారం తర్వాత-ఆఫీస్ ఫ్రెండ్స్ సమక్షంలో మేం రిజిష్టరు మారేజ్ చేసుకున్నాం పెళ్ళయ్యాక శేఖరం ఓ లిబర్టీ స్టాట్యూని ప్రెజెంట్ గా యిచ్చి "యిక్కడితో జీవితం ఆగిపోకుండా ప్రొసీడవండి" అన్నాడు

శుభమా అని పెళ్ళిదేవేళా అదే పెడసరం చాన్నాళ్ళనించి అణిగి ఉన్న కోపమంతా ఒక్కసారిగా బయటపడింది నాలుగూ దులిపేశాను

ఆ తర్వాత శేఖరం మాయింటి గడప

తొక్కలేదు యమ్ కాం. డిస్టింక్షన్ వచ్చినప్పుడు లెటర్ రాశాడు అంతే-ఆయన ఓ పదాదిలో కథారచయితగా కొద్దో గొప్పో పేరు తెచ్చుకున్నారు ఆయన్ని దెప్పుతూ-"పొద్దుకులూ కథలూ, యక్షిణీ జాబూ ఎదుగుదల ఎప్పుడు?....కథలు పసితనం లక్షణాలు ."-ఇలా సాగేవి శేఖర్ ఉత్తరాలు.

బేబీ పుట్టాక ఆయన నవలకి ఏదో పోటీలో ఫస్ట్ ప్రైజు వచ్చింది. ఊరంతా అభినందిస్తే "నవలల పిచ్చిలో పడి డిపార్ట్ మెంట్ పరీక్షలకు కూర్చోవడం మర్చిపోకు-" ఒకే ఒక వాక్యం రాశాడు శేఖర్!

మొట్టమొదటిసారి ఆయన బాధపడ్డారు చాలా కోపం కూడా వచ్చినట్టుంది! ఆ లెటర్ కి-ఆ విసురుకి జవాబివ్వలేదు-ఉత్తరాల అధ్యాయం అలా ఆగిపోయాక....

...రెండేళ్ళ తర్వాత ఏదో బేంక్ లో ప్రొబేషనరీ ఆఫీసర్ నయాననీ, కలకత్తాలో ఉన్నాననీ ఐ ఏ. యస్. కి ప్రిపేరవుతున్నాననీ రాశాడు

-ఇన్నాళ్ళ తర్వాత మళ్ళీ యిలా కలెక్టరై. .శేఖరం వస్తాడని కల్లోకూడా అనుకోలేదు!

o o o

భోజనాలయ్యాక ఆరుబయట మంచాలు వేశాను శేఖరం మంచంమీద నడుము వాలిస్తే ఎదురుగా వాలుకుర్చీలో ఆయన కూర్చుని కబుర్లు చెబుతున్నారు

పిల్లలు లోపల నిద్దరోతున్నారు. మెల్లిగా మొన్న కామేశ్వరి దగ్గరనించి తెచ్చిన టేప్ రికార్డర్ని స్టూల్ మీద పెట్టి "శంకరాభరణం" పాటల్ని వింటున్నాను

"ఏం బాగుందని ఆ సినిమాని ఊరంతా పడీపడీ చూస్తున్నారు?"-ఉన్నట్టుండి వచ్చిన శేఖరం ప్రశ్నకి నేనేకాదు, ఆయనా తెల్లబోయారు

"ఏం నీకు నచ్చలేదా?"

"అఫ్ కోర్స్ .. అంత గొప్పతనం ఏముందని జస్ట్ నార్మల్ " నాకు తిక్కరేగిపోయింది

"ఆర్ట్ని ఎంజాయ్ చేయడం కూడా అదృష్టమే" అన్నాను. "వెల్... ఓ మూవీనే ఆర్ట్ అయిపోదు... అసలు లైఫ్ లో డెవలప్ మెంట్ కి ఈ సోకాల్డ్ ఆర్టే అవరోధం. ఫీలవడమనేది....జస్ట్ వీక్ నెస్ . మనిషి ఊహించే జంతువు-అనే రూల్ ని రూలవుట్ చేయాలి . "

"సామజ వరగమనా . " జానకి గొంతు సన్నగా తీయగా ధ్వనిస్తోంది. రక్కున కట్టేశాను

ముగ్గురిమధ్యా భయంకరమైన నిశ్శబ్దం తాండవిస్తోంది

"ఓ బ్యూటిఫుల్ గర్ల్ ప్రెస్ట్ని చూసి బ్యూటీ అనకుండా జస్ట్ ఇట్స్ ఎ వెల్ డెవలప్డ్ పిట్యూటరీ గ్లాండ్ అనుకోవడం మెకానికల్ ....మొనాటనీ ..."మౌనంగా ఉన్న ఆయన మొదటి మాటకి ఉలిక్కిపడ్డాను.

శేఖరం లేచి కూచుని టవల్ భుజం చుట్టూ కప్పుకున్నాడు.

నా కళ్ళు రెపరెపలాడినయ్. మళ్ళీ కోల్డ్ వార్ మొదలవబోతోంది "బ్యూటీ అనే ఫీలింగ్ని ఎంజాయ్ చేయడం అనే ఇల్యూజన్ లో మనుషులు ప్రొడక్టివ్ థింకింగ్ని మర్చిపోతున్నారు. ఫారినర్స్ని చూడు . .ఎంత ప్రాక్టికల్ గా ఉంటారో "

"ప్రాక్టికాలిటీ మానెటరీ డెవలప్ మెంట్ .యివి ఇన్ స్టింక్ట్స్ని డామినేట్ చేయలేవు శేఖరం

"చేయాలి . లేకపోతే నో ప్రోగ్రెస్ .. కోపం తెచ్చుకోకపోతే ఆలోచించు. ఈ ఆరేళ్ళలోనూ ఆరొందల జీతగాడిలానే ఉన్నావు పైగా నలుగురు పిల్లలా...? ఇద్దరాడపిల్లల్తో ఫుల్ స్టాప్ పెట్టలేవూ... మగపిల్లాడు కావాలి... జస్ట్ సెంటిమెంటల్

చివరికేమైంది ట్విన్స్ పుట్టారు. నీ జీతం, రజనీ జీతం కలిస్తే పన్నెండొందలు. ఈ ఇంటి అద్దె రెండొందలు....ఈ మధ్య కోవాపరేటివ్ సొసైటీ లోన్ తో ప్లాట్




కొన్నానన్నావు ఎంత కట్ అవుతోంది.... మీ అమ్మా, నాన్నా, చెల్లాయిలిద్దరూ, తమ్ముడూ... వీళ్ళంతా యివాళ యింట్లో లేరు కాబట్టి ఇల్లు కాస్త ప్రశాంతంగా ఉంది నువ్వు వింటూ ఎంజాయ్ చేస్తూన్న పాటల రికార్డర్ మీది కాదు ఆరేళ్ళలో కనీసం డిపార్ట్‌మెంట్ పార్ట్ వన్ పరీక్ష అయినా నువు పాస్ కాలేదు కథ వ్రాస్తే వచ్చే యాభయ్యో నీ సిగరెట్ ఖర్చుకి చాలవు రాసినంతకాలమే రచయిత ఆ తర్వాత పేరేం మోగుతుంది? మనిషికి చప్పట్లు కూడు పెట్టవు. చెప్పు నీకూ నాకూ 'రాం రాం' అన్న మీనాన్న కులం కాని పిల్లని చేసుకున్నావని అంతె తెగిరిన నాన్న రిటైర్ అయాక ఎందుకు నీ గడప తొక్కాడు.. జస్ట్ డబ్బు. మనీ ఆలోచించు ... నేను సరిగ్గా ఆరేళ్ళ క్రితం చెప్పాను-తొందర పడుతున్నావని ...ఏం మిగిలింది. ఏం మిగుల్చుకోగలిగావు? వాట్ ది హెల్ యూ హేవ్ ఎఛీవ్డ్ సో ఫార్?"

—ఆయన ముఖం ఆ చీకట్లో ఎంతగా కందిపోయి ఉంటుందో నేనూహించగల్ను. ..ఛీ యింత బ్లంట్‌గా తన పొజిషన్ బాగుందని గిరుక్కున తొవలి కొచ్చేసి పడుకున్నాను.

సినిమాకెళ్ళిన మామయ్యా పిల్లలూ వచ్చేసరికి మళ్ళీ ఆలోచించే తీరికే లేక పోయింది.

మామగారి రికమెండేషన్‌తో సాధించిన కలెక్టరీ . వంటాణ్ణి పక్క వేసుకుని పడుకుని కసితీరా తిట్టుకున్నాను.

మర్నాడు శేఖరం వెళ్ళిపోయాడు. భార్య కలకత్తాలోనే ఉందట. ఆవిడ వచ్చాక మళ్ళీ వస్తానన్నాడు-

"ఎంత డబ్బుమనిషై పోయాడు?" ఆఫీసుకి బయల్దేరుతూ కోపంగా అన్నాను.

ఎప్పటిలానే చిన్నగా నవ్వేసి "వాడు ఐ. ఏ. యస్. సాధించగలడని నాకు తెలుసు కానీ తృప్తిని ఎప్పుడు సాధిస్తాడో " స్వగతంగా అనుకుని సైకిలెక్కారు.

నెలాఖరు వారం—

మధ్యాహ్నం బస్టాప్‌లో చిరాగ్గా చెమట తుడుచుకుని అసహనంగా బస్సు కోసం ఎదురు చూస్తూ నిల్చున్నాన్ను చేబదులు తెచ్చిన రెండొందలూ యిమ్మని కాత్యాయని సూటిగా అడిగేసింది. క్షల

కొట్టేసి నట్టనిపించింది. రెండ్రోజుల్లో యిచ్చేయాలి .ఫ్ఛ పన్నెండొందలు వస్తుందని పేరు ఆయనగారి సంసారంలో ఖర్చుతడిసి మోపెడవుతోంది కానీ ఎలా కాదనడం రిటైరైన ఆయన పెద్ద కూతురి పెళ్ళికి చేసిన అప్పుకి పైసా మిగలక నాయింటి మీదకి దండయాత్ర అనుమానంతో ఆలోచన్లు పక్కదారి పడుతున్నాయి ఇంత పెద్ద హేండ్ బేగ్‌లో రూపాయిన్నర మించి లేదు ఆయన దగ్గరెంతుందో, అసలుందో లేదో తెలీదు కనీసం రిక్షాలో వెళ్ళడమైనా కుదరని బ్రతుకై పోయింది

మొదటిసారిగా నన్ను నేను తిట్టుకున్నాను

వారం రోజులుగా నాకు తెలియకుండా నాలో శేఖరం మాటలు దయ్యాల్లా అంతెత్తై ఎదిగి దర్శన మివ్వసాగాయి

అవును జీవితానికేం మిగిలింది ? యల్డీసీనుంచి యూడీసీగానైనా మారలేదాయన తనూ ఎన్ని పరీక్షలు రాసినా తనూ ఏ బేంకులోనూ సెలక్టుగాలేదు స్టేటస్ అనేది అదృష్టమా లేక సామర్థ్యమా ?

నాలో పరాకు నా ప్రవర్తనలో నాకే స్పష్టంగా కన్పిస్తోంది

పెద్ద ఆడపడుచుకి సంబంధం కుదిరింది పెళ్ళి ఖర్చులు కట్నం ఎక్కడనించి రావాలి ?. మొదట్లో పరాయికులం పిల్ల వద్దన్నవాళ్ళు యివాళ తనడబ్బేలా తింటున్నారు ? —నాకు తెలీని పిశాచమేదో నన్ను ఆవహిస్తోంది తెలిసీ రెసిస్ట్ చేయలేక బలహీనంగా లొంగిపోతున్నాను

మర్నాడు—

సరిగ్గా పెళ్ళయిన ఆరో ఏడు!

కొత్త చీర ఇన్‌స్టాల్‌మెంట్ వాడిదగ్గర తీసుకున్నాను

రాత్రి-

సినిమా కెళ్ళొచ్చేసరికి రాజీ, చిన్నా యిద్దరూ ఇల్లెగిరిపోయేలా యేడుస్తున్నారు ముసలాళ్ళు నిద్దరోతుంటే ఆడపడుచు లిద్దరూ నవలా పఠనంలో....

-రాంగానే తిట్లు ... ఏడుపులు .... మూడంతా పాడైపోయింది

ఛీ ...ఇవాళకూడా బ్రతుక్కి విశ్రాంతి లేకుండా పోయింది శేఖరంలా ఈయనా ఎందుకు ప్రోగ్రెసివ్‌గా ఆలోచించరు-నాకొచ్చిన ఆలోచనకి నేనే నిలువెల్లా వణికి పోయాను

పదకొండు దాటాక-

ఎంతో యాంత్రికంగా....సెక్స్ కూడా జీవితంలో ఓ యాంత్రిక చర్యగా మారి పోతోందా... ఆయన గుడ్‌నైట్ చెప్పి పడుకున్నారు

నిద్ర .. నిద్ర నిద్ర....

ఊహలు పిశాచాల్లా నృత్యం చేస్తున్నాయి

గుండె డప్పులా మ్రోగుతోంది.... ఎక్కడో . ఎక్కడో . ..ఎక్కడో ...... సర్క్యూట్ బ్రేక్ అవుతోంది... ఎందుకీ అసంతృప్తి ?


లేచి వెళ్ళి టేబుల్ లైట్ వేసి బీరువాలోంచి ఆల్బం తీసి పెళ్ళినాటి ఫొటోలన్నీ చూస్తూ కూర్చున్నాను.. ఎన్ని ప్రేమలేఖలు సుధాకలం చిందించిన సుధాబిందువులు కానీ ఆరో పెళ్ళిరోజుకల్లా ?

ఒక్కసారి చుట్టూ చూశాను. పక్క గదిలో ముసలావిడా, కూతుళ్ళూ, వరండాలో మావగారూ, మరిదీ ఎన్ని సంకెళ్ళమధ్య ఆనందాన్ని వెతుక్కోవడం

"ఈ పిచ్చిగూటిలో మీరు నిజంగా ఎంజాయ్ చేస్తున్నారంటే నేను నమ్మలేను" శేఖర్ మాటలు షాక్స్‌లా జలదరింపచేస్తున్నాయి

"మనిషి ఎప్పుడు సుఖపడతాడు?—తృప్తి ఉన్నప్పుడు—తృప్తి ఎక్కడుంది? అది ఇన్‌స్టింక్ట్స్‌ని బట్టి మారుతూంటుంది" ఆయన మాటల్లో నాకెందుకో మొదటిసారిగా జీవం లేనట్టనిపించింది.

"తను సాధించలేడు—అనే మిస్టిక్




థాట్‌ని పెంచుకున్నప్పుడే మనిషి స్టేట్‌మెంట్స్ యిచ్చుకుంటాడు చరిత్రలోంచీ, సాహిత్యంలోంచీ, సైకాలజీలోంచీ ఉదాహరణలు వెతుక్కుంటాడు"—శేఖర్ మాటలు ఈ కెల్లా నిలువెల్లా వణుకు నుదుట చెమటలు పడుతున్నాయి.

ఈ ఐదు నిముషాల్లో ఈ గుసగుసల నిశ్శబ్దపు చప్పుళ్ళు పక్క గదిలోకి విన్పిస్తాయా? చంటి బాబులు లేస్తారా. ఎంత భయం.. ఎంత ఇరుకు చాలీచాలని క్షణాలమధ్య, అందీ అందని స్వర్గాన్ని అందుకున్నామని ఊహించేసుకుని తృప్తి పడటం .

కదుల్తూన్న చేతులు అప్రయత్నంగానే ఆగాయి. కాలేజీ రోజుల్లో ఆయనా, శేఖర్ కలిసి తీయించుకున్న ఫొటో—

ఈయనఆ రోజు తన తొందరకి వత్తాసు పాడి పెళ్ళి అనక పోతే లేదా ఈయనే శేఖరంలా కలెక్టరై

మైగాడ్ !—

పిడుగు పడ్డట్టు ఉలిక్కి పడ్డాను.

కోటి పాములు కోరలుసాచి కాటేసినంత షాక్. .ఏమిటి? తన అంతశ్చేతనలో ఊహాలిలా వక్రగతిన తిరుగుతున్నాయా?

—గభాల్న మూసేసి తేచి లైటార్పి పక్కదగ్గరికి నడిచాను. పామ్‌బెడ్స్ కొనాం అన్న ఆరేళ్ళ కోరిక ప్ప యిదే పట్టె మంచం నలుగురికి జన్మనిచ్చింది

మెల్లిగా పక్కనే పడుకున్నాను

మెత్తగా చేయి నా జుట్టు నిమురుతోంది "నిద్ర పట్టడంలా

"             "

"ఎందుకు?"

జవాబు లేని ప్రశ్న ఎందుకు? ఈ అసంతృప్తి. అశాంతి? బాధగా కళ్ళు మూసుకున్నాను ఎంత అమాయకంగా ప్రశాంతంగా పడుకున్నారు ఎంత తృప్తి అలాంటిది ఛీ శేఖర్ లా ఈయన ఈయనలా శేఖర్ భగవాన్ చర్య మాత్రమే నేరమా? ఊహాపాపం కాదా?

మరో అరగంట కాలం గాలం నాగుండె హోరుని అధికం చేస్తూ బరువుగా కదిలి పోయింది సముద్రం తిరగబడ్డట్టు

ఊహలు భయంకరంగా తాండవిస్తున్నాయి. నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను.

లేస్తూంటే....అదురు . వణుకు....చెమటలు. .గిల్టీ.. గిల్టీ . .ఎంత నీచపుటాలోచన

వంటింట్లో ఓ మూలగా గూట్లో ఉన్న దేవీ పటం ముందు నిలబడి కుంకుమ పెట్టుకుని చెంపలు వాయించుకున్నాను .కళ్ళు జలపాతాల్లా వర్షిస్తున్నాయి ..నిశ్శబ్దం నిశ్శబ్ద మథనం హారతి . అరచేతిలో ప్రమిదలా వెలిగించి ఈ ఊహని ప్రక్షాళనం చేసుకోవాలి... హారతి కర్పూరం అరచేతిలో .. అరక్షణం....క్షణం రెండు క్షణాల్లో చెయి భగ్గుమంది. కర్పూరం కిందపడిపోయింది. ఊహకీ వాస్తవానికీ ఎంత తేడా?!

ప్రక్షాళనం చేసుకోవడంకూడా డ్రెమటిక్‌గా యిమిటేట్ చేయబోయిన నా నాకే నవ్వొచ్చింది.. "ఎవరన్నారు మన జీవితంలో డ్రామా లేదని .."—ఆయన నాటకంలో డైలాగ్ గుర్తొచ్చి ఉలిక్కిపడ్డాను.

చెప్పెయ్యాలి ఈ పాపపు ఊహని ఆయనకి చెప్పేయాలి లేకపోతే తనకు శాంతిలేదు బ్రతకలేదు యింపాసిబుల్ ..

వెనక్కి తిరిగేసరికి గుమ్మానికి చేతులాన్చి సూటిగా తదేకంగా చూస్తూ నిలబడి ఆయన !

"ఏ పాపం చేశావని యిలా ప్రక్షాళనం చేసుకోవాలనుకుంటున్నావో నేనడగను నీ మనసు కుదుట పడితే చాలు నీ నుదుట ఆ కుంకుమ ఎంత ఎర్రగా మెరుస్తోందో నీ మనసూ అంత స్వచ్ఛమైంది....నేను నమ్ముతాను . " చేయి చాపారు

పరుగున వెళ్ళి ఆ గుండెల మీద వాలిపోయాను

నడిపిస్తూ గదిలోకి తీసికెళ్ళారు

చంటాశు చెప్పమన్నాను

ఆయన డ్రాయరు సొరుగంతా వెదికి సైకాల్ తీసి చేతికి రాశారు . మెకానికల్ అక్కడి కక్కడే ఆ మందురాస్తే— ఎంత డ్రెమటిక్ సిల్లీ .నేనెంత సిల్లీగా ఊహిస్తున్నాను... ఇదేం రకపు ఫోబియా?

ఆయన గుండెలు మీద వహుకుని—

చెప్పేయాలి చెప్పేయాలి

నుదుటిమీది జుట్టు సవరిస్తూ—"ఈమధ్య నీకసలు విశ్రాంతి కరవైపోతోంది కదూ . "

లేదు... కాదు కాదు లేదు అనాలి.. మాటలు పెగలడం లేదు "నిన్ను సుఖపెట్టపోకలేక పోతున్నానురా రాణీ " రాణీ. .ప కాంతంలో పిలిచే పిలుపు అయినా తనని హాంట్ చేయలేక పోతోంది . భగవాన్ . చెప్పేయాలి.

"ఇందాక ఇం దా .. క. "

"చెప్పు ఎందుకోసం ఈ అశాంతి "

ఆబ్బా ఎంతలాలన . ఎలా .ఎలా పెదవి కదలదు ఊహూ మరి .మరి .

"మనం ఇల్లెప్పుడు కట్టుకుంటామా అని" ..మోసం .చీటింగ్ ఇదేంటి ఒకటనబోతే యిదా బయటకొచ్చింది.. గుండెకి గుండెతాకినంత దగ్గర్లో ఉన్నా నో... హారైజన్ చోట నింగికీ నేలకీ ఉన్నంత దూరం కన్పించని ఎడం.

కాదు కాదు . శేఖర్, క్షణం పాటు... మీకంటే గొప్పగా కన్పించాడని ఎలా .. ఎలా ఎలా ఏభాషలో చెప్పగలను..

జుట్టుని సుతారంగా నిమురుతూ పిచ్చి . అందుకా దిగులు నీ అంతగా కోవాపరేట్ చేసే భార్య దొరకడం నా లక్ ...."

"నో ...నేను నేను.. "ఆయన నాకు చెప్పే అవకాశాన్నియలేదు.

"నేనే పరీక్షా పాస్ కాలేక పోయాను .. లక్ ఉందోలేదో తెలీదు. " —నాన్సెన్స్ . లక్ ఎందుకు శేఖరంలా ఛట్

విసురుగా లేచాను



"నేను పరీక్షలు పాస్ కాలేదని కోపం కదూ...కథ్రలాస్టూ లైఫ్‌లో ఎదగడంలేదని నువ్వూ శేఖరంలానే అంటావా?"

ఎలా.. ఎలా... చెప్పడం. కాదు. ఔను ఔను.. కాదు..ఊహూ—జీవించడం..వాస్తవం బ్రతకడం. మనిషికి ఏది కావాలి?

"శేఖరం అన్నట్టు మనంగానీ తొందర పడ్డామంటావా?"

"ఏమంటే " చప్పున నోరుమూసి భోరుమని గుండెల్లో తలదాచుకున్నాను ఈ మనిషివల్ల తను తీర్చుకోలేని కోరికల్ని... ఈ మనిషి గుండెల్లోనే తలదాచుకుని రాజీ పడటం...ఇది తృప్తికాదు .రాజీ.. .రాజీ పడడం.

ఊహాలు ఆలోచనలు . డైలాగులు.

"తృప్తికీ—రాజీకి తేడా ఏంటో తెల్సా ?"

" . . . . "

"ఒకటి సహజంగా కలిగేది—రెండోది కలిగించుకునేది...."

స్టేట్‌మెంట్స్ మనిషి సాధించలేని దానికి చరిత్రలోనూ సాహి చెవులు గట్టిగా మూసేసుకున్నాను. ఒళ్ళంతా ఆవిర్లు, చెమటలు భయంకరమైన ధ్వనులు వికృతంగా చీకటి నాల్కలు సాచి మీది మీది కొస్తున్నట్టు, దయ్యాలు, ఊహాల పిశాచాలు చీకటి మంటలు చుట్టేస్తున్నాయి వో వద్దు నాకీ జీవితం చాలు-అనుకోవడం రాజీపడటం తృప్తి కాదు. కౌనుకాదు కెవ్వుమన్నాను కీచుగా ఓ రాత్రి వేళ!

బల్లిలా హత్తుకుపోతున్న నన్ను బుజ్జగిస్తూ "ఏమైందిరా" లాలనగా అడిగారు

"క క కలొచ్చింది "

అబద్ధం—కోరికలు దయ్యాల్లా వెంటాడితే పారిపోయే పరుగుపందెంలో లొంగిపోయేవేళ అరచిన అరుపు.

గుండెకు గుండె శబ్దం వినిపించేంత చేరువులోనూ ఒకగుండె మరొక గుండెకు చెప్పలేని బలహీనత!

ఆయన నవలలో రాస్తారు భార్యాభర్తలమధ్య కూడా చెప్పలేని రహస్యాలుంటాయి...

జీవితంలో మొదటిసారి షాక్!

"కలా నిల్లీ నీ పిచ్చి"

ప్రేమగా గుండెల్లోకి తీసుకుంటున్నారు ఏడుపు తన్నుకొస్తోంది "వద్దు....నన్ను వదిలిపోవద్దు...నాకీ జీవితం చాలు. .చాలు" వెక్కి వెక్కి ఏడ్చాను చంటిపిల్లలా..,ఏమిటి ఏమంటున్నాను?

పసిపాపలా జోకొట్టి నిద్రపుచ్చుతున్నారు.

అయిపోయింది...లోపలి ఊహాలలోనే... నిద్రపోతే.,.ఏమన్నాను. ఇందాక. ఏమన్నాను.. కలా..కలా.. అబద్ధం... భగవాన్ మనిషి ఎంత ఎస్కేపిస్టు—మరెంత హిపోక్రైట్ ,.!